సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం। 10। నవంబర్। 2023



శబ్దం హద్దు మీరొద్దు
ఎన్నికల ప్రచారంలో వినియోగించే మైకల తో ఏ ప్రాంతంలో ఎంత డెసిబెల్స్ శబ్దం ఉండాలో ఈసీ పరిమితి విధించింది. IIలో



అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లో
ఎమ్మెల్యేగా పోటీచేసే అభ్యర్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసేందుకు ఈసీ కేవైసీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. IIలో

గరిష్టం / కనిష్టం
32° / 20°

వాతావరణం
జిల్లాలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణానికి మంచి నమోదవుతాయి. రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా రామయ్య నిత్యకల్యాణం



దాతకు రశీదు అందజేస్తున్న ఆలయ అధికారి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన కాకులపాటి రామారావు గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. అధికారులు ఆయనకు రశీదు ఇచ్చారు. కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

జిల్లా జడ్జి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

పాల్వంచ : చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, ఉన్నత చదువులతో లక్ష్యాలు సాధించాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ పిలుపునిచ్చారు. పాల్వంచ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. అవసరం ఉన్నా, లేకున్నా సెల్‌ఫోన్ చూస్తూ కాలాన్ని వృథా చేసుకోవద్దని, అందులో ఉన్న సమాచారాన్ని మాత్రమే సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్‌పై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. అంతకుముందు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమతి, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్.శివప్రసాద్ తదితరులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ కొటారి చలపతి రావు, సాతులూరి సత్యనారాయణ, ఆర్.కేదారేశ్వరరావు, ఎండీ.రంజాన్, రేపాక ప్రసాద్, ఆరుద్ర సత్యనారాయణ, వై.సాంబశివరావు, ఎస్‌పీ.నాయుడు, రంగనాథాచార్యులు, దస్తగిరి, కనకం శరత్ కుమార్, ప్రిన్సిపాల్ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జి నీరజ బదిలీ

కరీంనగర్ జిల్లా జడ్జిగా పదోన్నతి



కొత్తగూడెంటౌన్: రాష్ట్రంలో 15 మంది సివిల్ జడ్జిలకు జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు గురువారం వారిని బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు కొత్తగూడెం అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న ఆడెపు నీరజ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు. ఆమెకు కరీంనగర్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జిగా పదోన్నతి వచ్చిన విషయం తెలిసిందే. కాగా, పదోన్నతి పొందిన నీరజకు కొత్తగూడెం బార్ అసోసియేషన్ బాధ్యులు అభినందనలు తెలిపారు.

ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తాం

డీఎంహెచ్‌ఓ శిరీష

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం సబ్ జైల్‌లో ఉన్న ఖైదీలకు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఐదు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీ శిరీష అన్నారు. సబ్‌జైల్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ ఎస్టీఐ, హెచ్‌ఐవీ, టీబీ, హెపటైటిస్ బీ, హెపటైటిస్ సీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. వైద్య శిబిరంలో పరీక్షల తర్వాత ఎవరికైనా ఆయా వ్యాధులకు సంబంధించిన లక్షణాలు బయటపడితే వెంటనే వైద్యం అందిస్తామని తెలిపారు. రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలని, ఎవరికైనా అలాంటివి ఉంటే పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడితే తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో సబ్ జైల్ అధికారి ఉపేందర్, వైద్యులు దేవేందర్, సత్యప్రకాష్, సంఘమిత్ర, సోమయ్య పాల్గొన్నారు.

సెంచరీకి చేరువలో..

జిల్లాలో 83కు చేరిన నామినేషన్లు

- గురువారం ఒక్కరోజే 31 మంది 54 సెట్లు దాఖలు
- ఏకాదశి ముహూర్తం మంచిదనే భావన
- నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ
- కండువాలు మార్చుతున్న నేతలు



ఇల్లెందులో హరిప్రియ నామినేషన్ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : ముహూర్త బలం బాగుందనే నమ్మకంతో గురువారం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులతో పాటు ప్రధాన పార్టీల తరఫున పోటీ చేస్తున్నవారు కూడా నామినేషన్లు వేశారు. దీంతో రిటర్నింగ్ కార్యాలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

ఒక్కరోజే 31 నామినేషన్లు..

ఈనెల 3న ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినప్పటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. గత ఐదు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 52 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. గురువారం ఒక్కరోజే 31 మంది అభ్యర్థులు 54 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నుంచి ఏడుగురు అభ్యర్థులు 11 సెట్లు, మిగిలిన నాలుగు నియోజకవర్గాల్లో ఆరుగురు చొప్పున 43 సెట్లు వేశారు. కాగా, నామినేషన్ల దాఖలుకు శుక్రవారంతో గడువు ముగియనుంది. ఇప్పటి వరకు జిల్లా మొత్తం కలిపి 83 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో దూకేందుకు సిద్ధమయ్యారు. నేడు చివరి రోజు కావడంతో భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది. మొత్తంగా వంద మందికి పైగా అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఉందని పరిశీలకుల అంచనా.

రేగా, పొదెం, హరిప్రియ దాఖలు..

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, పొదెం వీరయ్య భద్రాచలం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పినపాక బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంతకు ముందు తల్లికి పాదాభివందనం చేసిన రేగా, అభిమానులతో కలిసి నామినేషన్‌కు బయలుదేరారు. ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోతు హరిప్రియా నాయక్ భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. వీరి తరఫున ఇప్పటికే నామినేషన్లు దాఖలైనప్పటికీ ముహూర్తం బాగుండడంతో మరోసారి నామినేషన్లు వేసేందుకు ఆసక్తి చూపారు.

మారుతున్న సమీకరణలు..

నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకోవడంతో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, ముగ్గురు కౌన్సిలర్లు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, పీఏసీఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, ఎంపీటీసీ మెట్ల శిరోమణి తదితరులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. రెండు రోజుల క్రితం సీపీఐని వీడి కేటీఆర్ ఆధ్వర్యంలో 'కారు' ఎక్కిన కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు గురువారం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రత్యక్షమయ్యారు. ఆ పార్టీ అభ్యర్థి వనమా గెలుపు కోసం పని చేస్తామని ప్రకటించారు. కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న ఎడవల్లి కృష్ణ ఆ పార్టీపై గుర్రుగా ఉన్నారు. అభిమానులతో మాట్లాడి శుక్రవారం తన రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు. ఆయన గులాబీ గూటికి చేరుతారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఎడవల్లి మద్దతు కోరుతూ కొత్తగూడెం సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గురువారం ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. పీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఆదాయపు పన్ను శాఖ దాడులను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ఓ వైపు ప్రచారం నిర్వహిస్తూనే మరోవైపు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి.

గురువారం దాఖలైన నామినేషన్లు ఇలా..

నియోజకవర్గం	అభ్యర్థులు
పినపాక	13
ఇల్లెందు	19
కొత్తగూడెం	22
అశ్వారావుపేట	15
భద్రాచలం	14
మొత్తం	83

'గూడెం'లో నేడు వనమా..

గత ఎన్నికల తర్వాత సీనియర్ ఎమ్మెల్యే, మాజీమంత్రి, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నామినేషన్ పత్రాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దీంతో ఈ ఏడాది నామినేషన్ వేసే విషయంలో ఆయన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులంతా ఇప్పటికే నామినేషన్లు వేసినా వనమా తొందరపడలేదు. శుక్రవారం ఆయన నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్తగూడెంలోని అమర వీరుల స్తూపం వద్ద నివాళులు అర్పించి నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకోనున్నారు.

బరిలో జలగం !

ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి జలగం వెంకట్రావు బరిలో ఉంటారా ? నిలిస్తే ఏ పార్టీ తరఫున పోటీ చేస్తారనే ఆసక్తి కొత్తగూడెంతో పాటు జిల్లా అంతటా నెలకొంది. అయితే శుక్రవారం జలగం వెంకట్రావు నామినేషన్ దాఖలు చేస్తారని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు.

అమ్మా దీవించు..

తల్లి ఆశీర్వాదం తీసుకుని నామినేషన్ దాఖలు చేసిన విప్ రేగా



తల్లి నర్సమ్మ ఆశీర్వాదం తీసుకుంటున్న రేగా కాంతారావు

బూర్గంపాడు: పినపాక నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు కరకగూడెంలోని తన నివాసంలో భార్య సుధారాణితో కలిసి తల్లి రేగా నర్సమ్మకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. గ్రామ దేవతలకు పూజల అనంతరం మణుగూరులో నామినేషన్ వేశారు.

అరాచక పాలనను అంతం చేద్దాం



మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో జెడ్పీ చైర్మన్ కోరం, మున్సిపల్ చైర్మన్ డీవీ, కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు

- మాజీ మంత్రి తుమ్మల పిలుపు
- మున్సిపల్ చైర్మన్ సహా పలువురు కాంగ్రెస్‌లో చేరిక

ఇల్లెందు : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదేళ్ల పాటు అవినీతి, అరాచకం సాగించిన పాలనను అంతమొందించి ధర్మ పాలన సాగిద్దామని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు మొగిలి లక్ష్మి, అంకెపాక నవీన్, వారా రవి గురువారం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను బీఆర్‌ఎస్‌లో చేరక ముందు ఆ పార్టీకి ఉమ్మడి జిల్లాలో ఒక్క సర్పంచ్, ఎంపీటీసీ కూడా లేరని, అలాంటి జిల్లాను గులాబీమయంగా మార్చామని అన్నారు. గత ఎన్నికల్లో కొందరి కుట్రలకు బలయ్యానని, పదవి లేకున్నా జిల్లాలో పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడ్డానని తెలిపారు. ఇటీవలి కాలంలో అభివృద్ధి మాటున అరాచకం, చందాలు, దందాలు సాగుతున్నాయని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ, రాహుల్ పిలుపు మేరకు కాంగ్రెస్‌లో చేరానని, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య కూడా ఇప్పటికే చేరారని, ఇప్పుడు డీవీ రాకతో ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడతామని హామీ ఇచ్చారు. ఇల్లెందు పట్టణాభివృద్ధికి గతంలో తాను, కోరం కనకయ్య కృషి చేశామని, సబ్‌స్టేషన్, డిగ్రీ కళాశాల, కోటిలింగాల నీటి పథకం, డివైడర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డీవీ హయాంలో మరింత మెరుగు పర్చారని చెప్పారు. పట్టణ రూపురేఖలు మార్చిన డీవీ కోరం కనకయ్య గెలుపు కోసం కాంగ్రెస్‌లోకి రావటం అభినందనీయమన్నారు.

ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్ కూడా..

ఇల్లెందురూరల్/టేకులపల్లి: ఇల్లెందు ఎంపీపీ చీమల నాగరత్నమ్మ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి గురువారం ఖమ్మంలో తుమ్మల సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ఎంపీటీసీ మెట్టెల శిరోమణితో పాటు మరికొందరు ముఖ్య నాయకులు ఉన్నారు. మరికొందరు ప్రజాప్రతినిధులు, పార్టీ పదవుల్లో ఉన్న ముఖ్య నేతలు సైతం బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక టేకులపల్లి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత కాలె ప్రసాదరావు కూడా తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇంకా బీఆర్‌ఎస్ నాయకులు మొగిలి ఈశ్వర్, నాగమణి, ఆళ్ల నాగేశ్వరరావు, గుమ్మడి అపర్ణ, భూక్యా కమల, వజ్జ శ్రీనుకు సైతం కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా డానియేల్, పులి సైదులు, జాఫర్, ఆరెం కిరణ్, ఎస్‌కె జానీ, పత్తి స్వప్న, స్వాతి, పాయం లలిత, కల్తీ పద్మ, తాటి చుక్కమ్మ, తిరుపతి, రాము, మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, కనగాల పేరయ్య, ప్రభునాథ్ పాల్గొన్నారు.

'గూడెం' చేరుకున్న ఎన్నికల పరిశీలకుడు



కమల్‌కిషోర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రియాంక ఆల



స్వపన్ సర్కార్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గానికి ఎన్నికల పరిశీలకుడిగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి కమల్‌కిషోర్ గురువారం రాత్రి కొత్తగూడెంలోని సింగరేణి గెస్టహౌస్‌కు చేరుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల మొక్క అందించి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్ల గురించి కమల్‌కిషోర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం రిటర్నింగ్ అధికారి శిరీష, డీఎస్పీ రెహమాన్, లైజన్ అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్లు పుల్లయ్య, కృష్ణప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

శాంతిభద్రతల అధికారికి స్వాగతం..

శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం జిల్లాకు వచ్చిన సీనియర్ ఐపీఎస్ అధికారి స్వపన్ సర్కార్‌కు సింగరేణి అతిథిగృహం వద్ద కలెక్టర్ ప్రియాంక ఆల స్వాగతం పలికారు.

పరిశీలకులను కలిసిన ఎస్పీ

కొత్తగూడెంటౌన్: జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు కమల్‌కిషోర్, శాంతిభద్రతల పర్యవేక్షణ అధికారి స్వపన్ సర్కార్‌ను ఎస్పీ వినీత్ మర్యాదపూర్వకంగా కలిశారు.

మాక్ పోలింగ్ పరిశీలన

- ఓటు వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

పాల్వంచ : ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. పట్టణంలోని బొల్లేరుగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మాక్ పోలింగ్‌ను ఆమె పరిశీలించారు. విద్యార్థులే పోలీసులుగా, ప్రిసైడింగ్ అధికారులుగా, పోలింగ్ స్టాఫ్, ప్రెస్, ఓటర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి విద్యార్థులే భవిష్యత్ ఓటర్లు అని అన్నారు. ఓటు వినియోగించుకోవడం వల్ల కలిగే లాభాలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం పోలింగ్ స్టేషన్‌లో వసతి సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి త్రినాథ్ బాబు, జిల్లా స్వీప్ మెంబర్ పూసపాటి సాయికృష్ణ, మండల విద్యాశాఖాధికారి శ్రీరామ్మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ, రత్నకుమారి, ఎస్.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, కృష్ణమోహన్, వరలక్ష్మి పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

ఇబ్బందులు రాకుండా చూడాలి

భద్రాచలంఅర్బన్: నామినేషన్ల స్వీకరణకు ఒక రోజు మాత్రమే గడువు ఉన్నందున శుక్రవారం ఎక్కువ మంది దాఖలు చేసే అవకాశం ఉందని, ఎంత మంది వచ్చినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల సూచించారు. గురువారం ఆమె భద్రాచలం ఆర్‌ఓ కార్యాలయాన్ని, డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నామినేషన్లు దాఖలు చేయడానికి ఎక్కువ మంది వస్తే ముందుగా టోకెన్లు జారీ చేసి క్రమ పద్ధతిలో స్వీకరించాలని అన్నారు. నామినేషన్ల నమోదు రిజిస్టర్‌ను పరిశీలించారు. జిల్లాలోకి వచ్చే ప్రతీ వాహనాన్ని అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద నిశితంగా పరిశీలించాలని చెప్పారు. పట్టుకున్న నగదు, మద్యం వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భద్రయ్య, తహసీల్దార్ శ్రీనివాసరావు, డీటీ రమేష్ పాల్గొన్నారు.

ఐటీ దాడుల కలకలం

- పొంగులేటి నివాసాలు, రాఘవ సంస్థ కార్యాలయంలో తనిఖీలు
- బంధువులు, సిబ్బంది ఇళ్లలో కూడా...
- నామినేషన్ ఏర్పాట్లలో ఉండగానే రంగంలోకి ఐటీ
- జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదుతో నామినేషన్‌కు అనుమతి



ఖమ్మంలోని పొంగులేటి నివాసం వద్ద పోలీసుల పహారా



ఖమ్మంలో పొంగులేటి నివాసం వద్ద ఆందోళనకు దిగిన పార్టీ శ్రేణులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసాలు, బంధువుల ఇళ్లు, రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయాలపై ఐటీ అధికారుల దాడులు కలకలం సృష్టించాయి. త్వరలోనే తనపై ఇన్‌కమ్‌టాక్స్ దాడులు జరిగే అవకాశముందని పొంగులేటి చెప్పిన మరుసటి రోజే అధికారులు రంగంలోకి దిగడం సంచలనం కలిగించింది. గురువారం ఉదయం 11 గంటలకు పాలేరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు పొంగులేటి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈక్రమంలో ఉదయం 5గంటలకు హైదరాబాద్ నుంచి ఎనిమిది వాహనాల్లో 15 మంది ఐటీ అధికారులు, స్థానికంగా ఉన్న పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఖమ్మంలోని పొంగులేటి నివాసానికి చేరుకున్నారు. ఆ వెంటనే కుటుంబసభ్యులు, సిబ్బంది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఇంట్లో పలు పత్రాలను పరిశీలించారు. దాడులు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగగా, ఖమ్మంరూరల్ మండలంలోని పాలేరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయం, బైపాస్‌రోడ్డులోని రాఘవ కన్‌స్ట్రక్షన్ కార్యాలయం, బంధువుల ఇళ్లు, కల్లూరు మండలం నారాయణపురంలోని స్వగృహంతో పాటు ఆయనకు సంబంధించిన ఫంక్షన్ హాళ్లలోనూ ఏకకాలంలో సోదాలు జరిగాయి.

కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన

ఖమ్మంలోని పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాసంలో ఐటీ తనిఖీలు జరుగుతున్నాయనే సమాచారంతో అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు చేరుకున్నారు. కావాలనే దాడులకు దిగారని ఆరోపించారు. అలాగే, ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ కాంగ్రెస్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. కాగా, పాలేరు క్యాంపు కార్యాలయం వద్ద పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి ఉండగా.. ఆయనను కూడా ఐటీ అధికారులు ప్రశ్నించారు. కాగా, తనిఖీల అనంతరం శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి, కుమారుడు హర్షారెడ్డి, సోదరుడు ప్రసాద్‌రెడ్డిని ఐటీ అధికారులు హైదరాబాద్ తీసుకెళ్లారు.

భారీ ర్యాలీతో..

ఐటీ అధికారులు తనిఖీల సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అక్కడే ఉండాలని సూచించగా, తాను నామినేషన్ వేయాల్సి ఉందని చెప్పారు. ఆ తర్వాత ఆయన జిల్లా ఎన్నికల అధికారికి లేఖ రాయడంతో అనుమతి రాగా, ఇంటి నుంచి నామినేషన్ వేసేందుకు భారీ ర్యాలీగా బయలుదేరారు. జెడ్పీసెంటర్, మయూరిసెంటర్, కాల్వొడ్డు మీదుగా ఖమ్మంరూరల్ ఆర్‌వో కార్యాలయ సమీపం వరకు ర్యాలీగా వెళ్లినా ఆయన, అక్కడి నుంచి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రామసహాయం నరేష్‌రెడ్డితో కలిసి వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

జైలుకెళ్లడానికైనా సిద్ధమే..

పాలేరులో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాను జైలుకెళ్లడానికైనా సిద్ధమేనని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై తనపై, కుటుంబ సభ్యులపై, నాయకుల ఇళ్లపై తనిఖీలకు దిగాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే విషయాన్ని జీర్ణించుకోలేని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి కేసీఆర్.. కేంద్రంలోని బీజేపీతో చేతులు కలిపి ఈ చర్యకు పాల్పడ్డారని తెలిపారు. తాను బీఆర్‌ఎస్‌ను వీడిన సమయంలో బీజేపీ పెద్దలు తనతో మాట్లాడి ఆ పార్టీలో చేరాలని కోరినా వెళ్లలేదన్నారు. ప్రజల కాంగ్రెస్‌లో చేరిన తనపై ఇప్పుడు వేధింపులు మొదలుపెట్టారని విమర్శించారు. ఈ విషయమై ఎన్నికల అధికారి, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని పొంగులేటి తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అధికార దుర్వినియోగంతో శ్రీనివాసరెడ్డిపై బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి ఐటీ దాడులు చేయిస్తున్నాయని ఆరోపించారు. ఏదిఏమైనా పాలేరు నుంచి ఆయన భారీ మెజార్టీతో గెలిచి తీరుతారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓడిపోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. ఆందోళనలు, ర్యాలీలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు నాగేశ్వరరావు, తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని బేబి స్వర్ణకుమారి, శెట్టి రంగారావు, కొంగర జ్యోతిర్మయి, సాదు రమేష్‌రెడ్డి, జొన్నలగడ్డ రవి, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారులు

అన్నపురెడ్డిపల్లి : గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్టేట్ ఆర్మాన్ టీం సభ్యులు డాక్టర్ శ్రీకీర్తి, డాక్టర్ అఖిల సూచించారు. గురువారం అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చైతన్యతో కలిసి సందర్శించారు. గర్భిణులకు అందిస్తున్న సేవల గురించి వైద్యాధికారులు ప్రియాంక, తన్మయిని అడిగి తెలుసుకున్నారు. మాతా శిశు సంరక్షణ కార్డులను పరిశీలించి, కార్డులను పూర్తిగా పూరించాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు రెగ్యులర్‌గా చెకప్ చేయాలని, రక్తహీనత ఉన్న వారికి ఐరన్ ఇంజెక్షన్ ఇవ్వాలని సూచించారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళా క్లినిక్‌ను మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ఓ ఎస్తేర్‌రాణి, హెచ్‌ఈఓ కృష్ణయ్య, హెచ్‌ఈ శారారాణి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పత్తి కొనుగోళ్లకు మూడు రోజులు సెలవు

సుజాతనగర్: మూడు రోజులపాటు సెలవులు ఉన్నందున ఈ నెల 11వ తేదీ నుంచి నుంచి 13 వ తేదీ వరకు స్థానిక మంజీత్ కాటన్ జిన్నింగ్ మిల్లుకు రైతులు పత్తి తేవొద్దని కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న రెండో శనివారం, 12న ఆదివారం, 13న దీపావళి సందర్భంగా మూడు రోజులపాటు సెలవులు ఉన్నాయని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ముందు ప్రచార రొద



అంగన్‌వాడీ కేంద్రం ముందు ప్రచార రథం

చర్ల: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో రాజకీయ పార్టీల ప్రచార రథాలు హోరెత్తిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, చర్చీలు, మందిరాలు, మసీదులు వద్ద కూడా పెద్ద పెద్ద శబ్దాలతో ప్రచారం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. కుదునూరులో తెరిచి ఉంచిన అంగన్‌వాడీ కేంద్రం ముందే ప్రచార రథం నిలిపి భారీ శబ్దంతో హోరెత్తించారు. ఎన్నికల సంఘం అధికారులు స్పందించి ఆయా పార్టీల నాయకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

బూర్గంపాడు: లక్ష్మీపురంలోని ఫిమాకెమ్‌లో పనిచేస్తున్న కార్మికుడు వామరాజు శ్రీనివాసరావు(46)కు గురువారం గుండె నొప్పి రావటంతో కుటుంబసభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలిస్తున్న క్రమంలో కొత్తగూడెం సమీపంలో మృతి చెందాడు. పదిహేనేళ్లుగా ఫిమాకెమ్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు హఠాన్మరణతో తోటి కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కార్మికసంఘాల నాయకులు కేవీ రామారావు, పీవీవీఎస్ఎస్వీ ప్రసాద్, ఏ గోవర్ధన్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

4 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మల్కాన్‌గిరి జిల్లా మథిలి తాలూకాకు చెందిన పొల్ పంగి, సింగుడు దొలాయికు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద గంజాయి లభించగా, అదుపులోకి తీసుకుని విచారించారు. అదే గ్రామానికి చెందిన రాజు గౌడ్ వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. పోలీసులు గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని అంచనా. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న నెల్లిపాకబంజర శ్రీ అభినవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దాటాక చోరీ జరిగింది. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఆలయ ద్వారం తాళం పగులగొట్టిన దొంగలు లోపలకు ప్రవేశించారు. హుండీ తాళాన్ని సైతం పగులగొట్టి భక్తులు వేసిన కానుకలను చోరీ చేశారు. ఈ దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. అశ్వాపురం ఎస్సై తిరుపతిరావు గురువారం సంఘటనా స్థలాన్ని, సీసీ ఫుటేజీని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోడుసాగుదారులపై కేసు నమోదు

అన్నపురెడ్డిపల్లి: మద్దుకూరు బీట్ పరిధి కంపగూడెం అటవీ ప్రాంతంలో గతంలో ఫారెస్ట్ అధికారులు చేపట్టిన ప్లాంటేషన్‌లో మొక్కలను ధ్వంసం చేసిన పలువురిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఎస్ఓ నాగరాజు ఫిర్యాదు మేరకు కంపగూడెం, నామవరం గ్రామాలకు చెందిన పది మంది పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షాహీన తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాల్వంచ: పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పట్టణంలోని ఇందిరా కాలనీ సమీపంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని, రూ.6,100 నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.

కలప పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని జిన్నెలగూడెం గ్రామశివారులో అక్రమంగా నిల్వ చేసిన పది టేకు దిమ్మెలను అటవీశాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కలప విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అంచనా. డీఆర్ఓ శోభన్, వెంకటరత్నం పాల్గొన్నారు.

గెలుపోటముల్లో హ్యాట్రిక్!

- మధిరలో మూడేసి సార్లు ఓడి, గెలిచిన బోడేపుడి
- మూడుసార్లు గెలిచిన భట్టి, ఓడిన కమల్‌రాజు





బోడేపుడి వెంకటేశ్వరరావు

మధిర: మధిర శాసనసభ్యులుగా సీపీఎం నుంచి గెలుపొందిన బోడేపుడి వెంకటేశ్వరరావు మూడుసార్లు ఓడిపోయిన అనంతరం మూడుసార్లు విజయం సాధించారు. మధిర మండలం తొండల గోపవరానికి చెందిని బోడేపుడి వెంకటేశ్వరరావు వైరా మండలం గండుగులపాడులో స్థిరపడ్డారు. 1967 అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థిగా బోడేపుడి వెంకటేశ్వరరావు తొలిసారి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి దుగ్గినేని వెంకయ్య చేతిలో 10,404 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1972లో ఎన్నికల్లో దుగ్గినేని వెంకట్రావమ్మ చేతిలో 17,342 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆతర్వాత 1983లో మళ్లీ సీపీఎం నుంచి పోటీకి దిగిన బోడేపుడి వెంకటేశ్వరరావు పోటీ చేసినా కాంగ్రెస్ అభ్యర్థి శీలం సిద్ధారెడ్డిపై చేతిలో 11,187 ఓట్ల తేడాలో ఓటమి ఎదుర్కొన్నారు. అయితే, టీడీపీలో సంక్షోభంతో అప్పటి సీఎం ఎన్టీఆర్ అసెంబ్లీని రద్దు చేయగా, 1985 ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన బోడేపుడి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ అభ్యర్థి శీలం సిద్ధారెడ్డిపై 9,068 ఓట్లతో తొలిసారిగా విజయం దక్కించుకున్నారు. అనంతరం 1989 ఎన్నికల్లో బోడేపుడి సీపీఎం అభ్యర్థిగా రెండోసారి శీలం సిద్ధారెడ్డిపై 7,027 ఓట్ల తేడాతో గెలవగా, 1994 ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో మళ్లీ సిద్ధారెడ్డిపైనే 9,161 ఓట్ల తేడాతో విజయం సాధించారు. సీపీఎం శాసనసభ పక్ష నేతగా కొనసాగిన బోడేపూడి 1997 ఆగస్టు 5న మృతి చెందారు. నాలుగు సార్లు ఓడిపోయినా, మళ్లీ వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ లిఖించిన ఆయన రైతు బాంధవుడుగా మధిర నియోజకవర్గంలో మంచి పేరు తెచ్చుకున్నారు. కాగా, బోడేపూడిని ఓసారి ఓడించిన సిద్దారెడ్డి వరుసగా మూడుసార్లు ఆయన చేతిలో ఓడిపోవడం గమనార్హం.

ఒకరి గెలుపు.. మరొకరి ఓటమి



మల్లు భట్టి విక్రమార్క



లింగాల కమల్‌రాజు

2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క 1,417 ఓట్ల స్వల్ప ఓట్ల మెజార్టీతో సీపీఎం అభ్యర్థి లింగాల కమల్‌రాజ్‌పై మొదటిసారిగా విజయం సాధించారు. అలాగే, 2014లో ఎన్నికల్లో వీరిద్దరు మళ్లీ పోటీ చేయగా భట్టి 12,468 ఓట్ల మెజార్టీతో రెండో సారి గెలుపు దక్కించుకున్నారు. మళ్లీ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి మల్లు భట్టివిక్రమార్క, బీఆర్ఎస్ నుంచి కమల్‌రాజ్ పోటీ పడగా 3,567 ఓట్ల మెజార్టీతో భట్టినే విజయం వరించింది. ఇలా మధిర నియోజకవర్గంలో 'హ్యాట్రిక్' జయాపజయాలు ప్రత్యేక స్థానం సాధించాయి. ఈ ఎన్నికల్లోనూ వీరిద్దరు పోటీ పడుతుండగా, ఎవరిని విజయం వరిస్తుందనే చర్చ జరుగుతోంది.

అభ్యర్థుల వివరాలు ఆన్‌లైన్‌లో..

కేవైసీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ఎన్నికల సంఘం



కేవైసీ యాప్ ఇదే..



యాప్‌లో అభ్యర్థుల వివరాలు

అశ్వారావుపేటరూరల్: ఎన్నికల సంఘం సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా ఉపయోగిస్తోంది. అభ్యర్థుల నామినేషన్, అఫిడవిట్ తదితర వివరాలు కూడా ఓటర్లకు అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు నామినేషన్ వేసే క్రమంలో ఆస్తులు, అప్పులు, విద్యార్హత తదితర వివరాలు, అఫిడవిట్లు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సమర్పిస్తున్నారు. అభ్యర్థుల నామినేషన్, అఫిడవిట్ల వివరాలను తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. ఈ వివరాలు రిటర్నింగ్ అధికారి వెల్లడించే వరకు వేచి చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. యాప్ ద్వారా క్షణాల్లో నామినేషన్, అఫిడవిట్ల వివరాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోనే అవకాశం ఉంది.

కేవైసీ యాప్‌లో..

ఎన్నికల సంఘం తాజాగా జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేవైసీ(నో యువర్ క్యాండిడేట్)యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యాప్ డౌన్‌లోడ్ చేసిన తర్వాత నేరుగా అభ్యర్థి పేరు, నియోజకవర్గం, రాష్ట్రం, అసెంబ్లీ ఎన్నికలు-2023 ఆప్షన్లపై క్లిక్ చేసి వివరాలు నమోదు చేసేత్ చాలు క్షణాల్లో నామినేషన్ దాఖలు చేసిన వారి ఫొటోతో సహా అన్నీ వివరాలు కనిపిస్తాయి. ఆయా అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లు సైతం యాప్‌లో అందుబాటులో ఉంచుతున్నారు. నామినేషన్, అఫిడవిట్లు పత్రాలను కేవైసీ యాప్‌లో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ చాలా నియోజకవర్గాల్లోని రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది ఆయా పత్రాల పరిశీలన పూర్తి చేసి తక్షణమే అప్‌లోడ్ చేస్తున్నారు. రిటర్నింగ్ అధికారికి అందిన మొత్తం నామినేషన్ల సంఖ్య, పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య, నామినేషన్లు ఆమోదించిన సంఖ్య, నామినేషన్లు తిరస్కరణ, ఉపసంహారణ సంఖ్య వివరాలు సైతం పోర్టల్‌లో పొందుపరిచారు. ఈ పోర్టల్‌లో తెలంగాణ రాష్ట్రంలోని అన్నీ నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల నామినేషన్లు, అఫిడవిట్లు ఎప్పటికప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి.

ఆడా ఉంటా.. ఈడా ఉంటా!

అందరి నామినేషన్లలోనూ టీడీపీ జెండాలు



బీఆర్ఎస్, టీడీపీ జెండాలతో ఓ కార్యకర్త

సత్తుపల్లిరూరల్: ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పోటీలో లేకపోవడంతో ఆ పార్టీ అభిమానులు, కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. సత్తుపల్లిలో గురువారం బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, డాక్టర్ మట్టా రాగమయి నామినేషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు కొందరు బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో.. మరికొందరు కాంగ్రెస్ అభ్యర్థి ర్యాలీలో పాల్గొనడం కనిపించింది.



కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో టీడీపీ జెండాలు

ప్రచార వేదికలుగా సామాజిక మాధ్యమాలు

ఎన్నికల వేళ గ్రూపుల్లో విమర్శలు, ప్రతి విమర్శల గోల..



బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల తరుణంలో సామాజిక మాధ్యమాలే ప్రచార వేదికలుగా మారాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఆయా పార్టీల ప్రచారాలు హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా వాట్సాప్ గ్రూప్‌ల్లో చర్చలు, ప్రచారాలు, విమర్శలు, ప్రతి విమర్శలు రసవత్తరంగా సాగుతున్నాయి. సోషల్ మీడియాలో రాజకీయ ప్రచార్భాటాలతో ఆయా గ్రూప్ సభ్యులు విసుగు చెందుతున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. సామాజిక మాధ్యమాలు ఓపెన్ చేయాలంటేనే కొందరు భయపడుతున్నారు. కుటుంబ గ్రూప్‌లు, ఫ్రెండ్స్ గ్రూప్‌లు, ఉద్యోగుల గ్రూప్‌లు, రైతుల గ్రూప్‌లు, వ్యాపారుల గ్రూప్‌లు, కార్మికుల గ్రూప్‌లు ఏ రకమైన గ్రూప్ అయిన రాజకీయ పార్టీల ప్రచారాలతో నిండిపోతున్నాయి. ఎన్నికల వేళ రాజకీయపార్టీలు కొన్ని వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి అందరిని అందులో యాడ్ చేశారు. ఆ గ్రూప్‌లను వీడుదామంటే ఆ పార్టీలు తమను అనుమానిస్తాయనే భయంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఉండాల్సివస్తోంది.

ప్రత్యేకంగా సోషల్ మీడియా కోఆర్డినేటర్లు

ఎన్నికల ప్రచారాల కోసం ఆయా పార్టీలు గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు సోషల్ మీడియా కో ఆర్డినేటర్లను నియమించుకున్నాయి. వారికి వేతనాలిచ్చి ప్రచారానికి సంబంధించిన పోస్టింగ్ పెట్టించటం, ప్రత్యర్థులపై విమర్శలు చేయించటం చేస్తున్నారు. అభ్యర్థుల ప్రచారానికి సంబంధించి ఫొటోలు, వీడియోలు తీసేందుకు కూడా ప్రైవేటు ఏజెన్సీలను ఆయా పార్టీలు నియమించుకుంటున్నాయి. కొన్ని యూట్యూబ్ చానళ్లతో ఒప్పందాలు చేసుకుని తమ ఎన్నికల ప్రచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు పెడుతున్న పోస్టింగ్‌లతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అభ్యర్థులపై విమర్శలు, ప్రతి విమర్శలతో కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావారణం నెలకొంది. అసభ్యకర, బూతులతో కూడిన పోస్టింగ్‌ల వల్ల ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచార పోస్టింగ్‌లపై నియంత్రణ ఉండాలని పలువురు కోరుతున్నారు.

శబ్దం హద్దు మీరితే కేసులే..



చుంచుపల్లి: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించుకున్న పాటలను మైక్‌లతో మార్మోగిస్తుంటారు. ప్రజలకు అతిధ్వనులతో అసౌకర్యం కలగకుండా ఎన్నికల సంఘం పరిమితి విధించింది. హద్దు మీరి శబ్దం పెరిగితే కేసులు నమోదు చేస్తారు. శబ్దం ఏ ప్రాంతంలో ఎన్ని డెసిబెల్స్‌ను మించకుండా ఉండాలో నిబంధనలను రూపొందించారు. వీటిని ఉల్లంఘిస్తే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది.

ప్రాంతం	ధ్వనిస్థాయి
కాలనీలు, బస్తీలు, నివాస ప్రాంతాలు	45 నుంచి 55 డెసిబెల్స్
విద్యాలయాలు, న్యాయస్థానాలు	40 నుంచి 50 డెసిబెల్స్
వ్యాపార సముదాయాలు	55 నుంచి 65 డెసిబెల్స్
పారిశ్రామిక ప్రాంతాలు	70 నుంచి 75 డెసిబెల్స్

నగదు సీజ్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద గురువారం పోలీసులు రూ.1.92 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. సరైన ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి భద్రాచలం వైపు ఓ వాహనంలో తీసుకొస్తుండగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

బ్యాడ్మింటన్, కరాటే జట్ల ఎంపిక



బాలుర బ్యాడ్మింటన్ జట్టుతో కోచ్‌లు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్, కరాటే ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 250 మంది క్రీడాకారులు హాజరు కాగా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్ల వివరాలను జిల్లా క్రీడల సంఘం కార్యదర్శి కె.నర్సింహారావు వెల్లడించారు. అండర్-14 బాలుర బ్యాడ్మింటన్ జట్టుకు విశ్వతేజ, వినయ్, మేఘ, వర్షిత్, విష్ణుతేజ, బాలికల జట్టుకు రితికశ్రీ, చరితశ్రీ, చిద్విలాసిని, నవరత్, తాబాసం, స్మైలీ ఎంపికయ్యారని తెలిపారు. అండర్ - 17 బాలురలో తేజస్విపేక్, త్రివిక్రమ్, అరవింద్, కార్తీక్, సందీప్, బాలికల జట్టుకు తులసి శ్రీజ, దివ్య, అమృత, లోహిత, శృతి ఎంపిక కాగా, కరాటే అండర్-14 బాలుర జట్టుకు శివకళ్యాణ్, అబ్దుల్ రఫీక్, సాయి హర్షిత్, మర్రిమను, తనూష రఘురాం, ఉదయ్ కిరణ్, ఇర్ఫాన్, కృష్ణతేజ, బాలికల జట్టుకు గోపజ, నివేదిత, నందిత, శైలుకుమారి, అలీషా ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఇక అండర్-17 బాలుర జట్టుకు మధుకర్‌రెడ్డి, నరేంద్రబాబు, సాయివరుణ్, హర్షతేజ, ప్రణయ్‌రాజ్, ఆదిల్‌పాషా, అసదుద్దీన్, వెంకటధనుష్, సాయిచరణ్, బాలికల జట్టుకు అక్షయ, వైష్ణవి, రిషిత, సింధూర, కావ్య చౌదరి, తన్వీర్, నిఖిత ఎంపికయ్యారని తెలిపారు.

బారికేడ్లు దాటిన ఎంపీ ఎస్కార్ట్ వాహనం



ఎంపీ వాహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థిగా సండ్ర వెంకటవీరయ్య నామినేషన్ కార్యక్రమానికి ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటవీరయ్యతో కలిసి ఎంపీ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనికి వెళ్లారు. ఈక్రమంలో ఆయన ఎస్కార్ట్ వాహనం కార్యాలయం వద్ద వంద మీటర్ల బారికేడ్లను దాటి ముందుకొచ్చింది. పోలీస్ వాహనం అనుకుని బారికేడ్లు తీశాక వెనుకే ఎంపీ వాహనం వస్తుండడంతో పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 200 మీటర్ల మార్కింగ్ వద్దే వాహనాలు నిలిపివేయాల్సి ఉండగా.. 100 మీటర్ల మార్కింగ్ బారికేడ్లను సైతం దాటి వాహనాలు రావడం చర్చనీయాంశమైంది.

చిన్నారికి ప్రాణం పోశారు..

భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో మెరుగైన వైద్యం



ఐసీయూలో చికిత్స పొందుతున్న బాలిక

భద్రాచలంఅర్బన్: ఏపీలోని వీఆర్‌పురం మండలం సోపెల్లి గ్రామానికి చెందిన ధర్ముల మారాత అనే ఏడు సంవత్సరాల పాప ఈ నెల 2న అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి ఇంట్లో పడి ఉంది. గమనించిన తల్లిదండ్రులు మరుసటి రోజు భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి పాప ప్రాణాపాయ స్థితిలో ఉందని చెప్పారు. చికిత్స అందిస్తుండగా పాప గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. అత్యవసర పరిస్థితుల్లో పాపకు సీపీఆర్, ఇంటుబేషన్ చేసి వెంటిలేటర్‌పై పాపను ఉంచి చికిత్స అందించారు. నాలుగు రోజుల చికిత్స పాప పూర్తిగా కోలుకోగా, గురువారం వైద్యులు డిశ్చార్జి చేశారు. బతకదని భావించిన తమ కూతురికి ప్రభుత్వ వైద్యులు ప్రాణాలు పోశారని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులపాటు పాపకు ఏరియా ఆస్పత్రి వైద్యులు అందించిన చికిత్స పాము కాటుకు సంబంధించినది కాగా, పాపకు మాత్రం ఎక్కడా పాము కాటు వేసిన ఆనవాలు లేకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తదితరులు వైద్యులు, సిబ్బందిని అభినందించారు.

పశువుల వాహనం స్వాధీనం

ఐదు పశువులు మృత్యువాత

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా మూగజీవాలను తరలిస్తున్న కంటైనర్‌ను గురువారం పోలీసులు పట్టుకున్నారు. కాగా పట్టుబడిన కంటైనర్ వాహనంలో ఐదు పశువులు మృత్యువాత పడగా, మరో 15 మూగజీవాల పరిస్థితి విషమంగా ఉంది. ఒడిశా నుంచి హైదరాబాద్‌లోని కబేళాకు అక్రమంగా 83 పశువులను తరలిస్తుండగా అశ్వారావుపేట సమీపంలో ఎస్సై శ్రీకాంత్ వాహనాల తనిఖీల్లో గుర్తించి పట్టుకున్నారు. కంటైనర్ వాహనంలో మూగజీవాలను కిక్కిరిసేలా ఎక్కించడంతోపాటు, అవి కనీసం కదలకుండా కాళ్లను తాళ్లతో కట్టేశారు. దీంతో ఐదు మూగజీవాలు మృతి చెందాయి. హైదరాబాద్‌కు చెందిన నిందితుడు షాజిద్ అహ్మద్‌ఖాన్‌పై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుకున్న మూగజీవాలను పాల్వంచలోని గోసంరక్షణ కేంద్రానికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

దుమ్ముగూడెం: మండలంలోని జెడ్ వీరభద్రారం గ్రామానికి చెందిన ఇర్పా జంపన్న (22) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ గణేష్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఇర్పా వీరయ్యకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు మౌనికకు 3 నెలల క్రితం పాప జన్మించింది. అనారోగ్యంతో చిన్నారి బుధవారం రాత్రి ఆస్పత్రిలో మృతి చెందింది. దీంతో తల్లి మౌనిక కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఆమె మనోవేదన చూడలేక సోదరుడు జంపన్న తాను చనిపోతానని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు మందలించారు. కాగా గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాప మృతదేహం ఇంటి ముందు ఉండగానే జంపన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 ద్వార వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనమాకు మద్దతు ప్రకటించిన గడల!

పాల్వంచ: త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వనమా వెంకటేశ్వరరావుకు జీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్, హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు మద్దతు ప్రకటించారని ట్రస్ట్ ఆర్గనైజర్లు మోదుగు జోగారావు, అంజినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం పాత పాల్వంచలో వనమాను కలిసి సన్మానించారు. అనంతరం గడల శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడి తన మద్దతు తెలిపినట్లు వెల్లడించారు.

ఏ రాజకీయ పార్టీకీ మద్దతు తెలపలేదు: గడల

కొత్తగూడెంరూరల్: నేను ప్రభుత్వ ఉద్యోగినని, తాను ఏ రాజకీయ పార్టీకీ మద్దతు తెలపలేదని హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు. తాను స్థాపించిన డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని, ట్రస్టుకు రాజకీయాలకు ఎంటువంటి సంబంధం లేదని పేర్కొన్నారు. జీఎస్ఆర్ ట్రస్టు నుంచి జోగారావు, అంజి ఎమ్మెల్యే వనమా దగ్గరకు వెళ్లి ఎన్నికల్లో డీహెచ్ గడల శ్రీనివాసరావు మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారని, అది సోషల్ మీడియాలో ప్రచారమైందని, అయితే ఈ వార్త నిజం కాదని తెలిపారు. వారికి మద్దతు ఇస్తున్నట్లు తాను చెప్పలేదని వివరించారు.

ఇల్లెందు బీఎస్పీ అభ్యర్థిగా ప్రతాప్



బాదావత్ ప్రతాప్

టేకులపల్లి: బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఇల్లెందు అభ్యర్థిగా టేకులపల్లి మండలం మద్రాస్‌తండా పంచాయతీకి చెందిన బాదావత్ ప్రతాప్ ఎంపికయ్యారు. ఈమేరకు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయనకు బీఫాం అందజేశారు. గ్రామంలో దరియా - తులిసమ్మ దంపతులకు జన్మించిన ప్రతాప్ ప్రాథమిక విద్య స్వగ్రామంలో పూర్తిచేశాక, కొత్తగూడెంలో ఇంటర్, బీటెక్ కడప యోగి వేమన యూనివర్సిటీ, పీజీ బెంగళూరులో పూర్తిచేశారు.

పురుగుల అన్నం పెడుతున్నారని ఆందోళన



హెచ్‌ఎంను నిలదీస్తున్న తల్లిదండ్రులు

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలలో చదివే విద్యార్థులకు పురుగుల అన్నం పెడుతున్నారని ఆరోపిస్తూ విద్యార్థినుల తల్లిదండ్రులు గురువారం ఆందోళన నిర్వహించారు. పాతకొత్తగూడెం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు ఉంటున్నాయని, అయినా అలాగే పెడుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు పాఠశాలకు చేరుకుని హెచ్‌ఎంను నిలదీసి, ఆందోళన చేశారు. పురుగులతో ఉన్న అన్నం విద్యార్థినులు ఎలా తినాలని ప్రశ్నించారు. బాత్‌రూంలలో నీటి సదుపాయం సరిగ్గలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాగా ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ సమస్యలను ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లామని, తన చేతిలో ఏమి లేదని సమాధానం చెప్పడం గమనార్హం.

ఫ్యాషన్





పట్టుబట్టలతోనే కాదు మనవైన సంప్రదాయ దుస్తులతోనూ వెలిగిపోవచ్చు.
మోడ్రన్ షేర్వాణీలను ధోతీ ప్యాంట్లతో మ్యాచ్ చేయచ్చు.
పర్యావరణ అనుకూలమైన డ్రెస్సులను ఎంచుకోవచ్చు.
పాత కాలం నాటి ప్రింట్లు, హ్యాండ్‌మేడ్ డిజైన్స్‌కి ప్రాధాన్యం ఇవ్వచ్చు.
ఎవర్‌గ్రీన్ లుక్‌తో రాబోయే రోజులను
ప్రకాశవంతంగా మార్చడానికి ఈ దీపావళి నుంచే మొదలుపెట్టవచ్చు.
పండగ రోజున దీపాలనే కాదు
సరికొత్త ట్రెండ్‌తో వార్డ్ రోబ్‌లను కూడా వెలిగించవచ్చు.
ప్రతి వేడుకలోనూ మెరిసిపోవచ్చు.

వార్డ్ రోబ్‌లకూ వెలుగులు



నియో–సంప్రదాయం

పాతకాలం నాటి కుర్తాలు, షేర్వాణీలు ఇప్పుడు కొత్తగా రూపాంతరం చెందాయి. ఈ దీపావళికి ఇవి ఎంతో అందంగా ఉంటాయి. అలాగే, లేయర్డ్ షేర్వాణీలు, ధోతీ ప్యాంట్‌లను ధరించవచ్చు. వీటిని మోడర్న్ డిజైన్, ఓల్డ్ ట్రెడిషన్‌తో మిళితం చేయచ్చు. ఈ మిక్స్ అండ్ మ్యాచ్ వల్ల సొగసైన రూపాన్ని పొందవచ్చు. ఇక నియాన్ కలర్స్ ఇప్పుడు ట్రెండ్‌లో ఉన్నాయి. వీటిలో బ్లూ, రెడ్, గ్రీన్, ఎల్లో కలర్స్ చాలా ప్రకాశవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ రంగుల నుండి కాంతివంతంగా కనిపిస్తాయి.

పర్యావరణ అనుకూలం

సరైన అవగాహనతో ఫ్యాషన్ పర్యావరణ అనుకూల బట్టల వైపు మొగ్గు చూపుతోంది. సేంద్రియ పత్తి, వెదురు, జనపనార బట్టలు స్థిరంగా ఉండటమే కాకుండా మట్టి సొబగులను కూడా వెదజల్లుతాయి. సురయ్యా, ఇతర ప్రముఖ బ్రాండ్‌లు ఈ ట్రెండ్‌లో ముందంజలో ఉన్నాయి.



పేస్టల్స్ పెరుగుదల

దీపావళి ప్రకాశవంతమైన రంగులకు పర్యాయపదంగా ఉన్నప్పటికీ, లావెండర్, మింట్, బేబీ పింక్ పేస్టెల్ కలర్స్ పండుగ కళను పెంచుతాయి. ఈ రంగులు ప్రశాంతతతోపాటు రిచ్‌నెస్‌ను కళ్లకు కడతాయి.

డిజిటల్ ప్రింట్లు సాంప్రదాయ మూలాంశాలు

సాంకేతికత మన జీవితంలోని ప్రతి రంగాన్నీ ప్రభావితం చేస్తున్నప్పుడు ఫ్యాషన్‌ను మాత్రం ఎందుకు వదిలివేయాలి... అందుకే, లోటస్ లేదా పీకాక్ ఫెదర్స్‌తో కూడిన భారతీయ సంప్రదాయ మూలాంశాలను ప్రదర్శించే డిజిటల్ ప్రింట్లు గొప్పగా కనిపిస్తున్నాయి. ఈ ప్రింట్లు, డిజైన్లు సంప్రదాయానికి ఆధునిక టచ్‌ను అందిస్తున్నాయి.

పాతకాలపు డిజైన్ల పునరుద్ధరణ

బనారసీ సిల్క్స్, చికంకారి ఎంబ్రాయిడరీ, బంధని వంటి పాతకాలపు వస్త్రాల ఆకర్షణ మళ్లీ మళ్లీ ఆకట్టుకుంటుంది. డిజైనర్లు ఈ సంప్రదాయ వస్త్రాలను ఆధునిక దుస్తులలో డిజైన్ చేస్తున్నారు. మనదైన గొప్ప వారసత్వాన్ని దేశీయ కళాకారులు కాపాడుతున్నారు.

చేతితో తయారు చేసిన పాదరక్షలు

పాదరక్షల్లో మన దేశీయ హస్తకళా నైపుణ్యం తనదైన ముద్ర వేస్తోంది. జూతీలు, కొల్హాపురీ, ఎంబ్రాయిడరీ ఇతర అలంకారాలతో చేతితో తయారు చేసిన పాదరక్షలలో దేనిని ఎంపిక చేసుకున్నా పండగ కళ కనిపిస్తుంది. ఇవి కళాకారుల నైపుణ్యానికి నిదర్శనంగా ఉండటమే కాకుండా, వేడుకలో ప్రత్యేకమైన టచ్‌ను అందిస్తాయి.





సమాజానికి మంచి ఆహారాన్నివ్వాలనుకుంది.
ఖాద్యమ్... పేరుతో తినదగిన ఆహారాన్నిస్తోంది.
'వరల్డ్ ఫుడ్ ఇండియా'లోనూ నిరూపించుకుంది.
దేశ రక్షణ కోసం కొండల్లో గుట్టల్లో డ్యూటీ చేసే
సైన్యానికి మంచి ఆహారాన్నిచ్చే బాధ్యత చేపట్టింది.
ఈ సందర్భంగా కట్టెకోల మాధవి విజయగాథ.

జై జవాన్‌కు టిఫిన్ బాక్స్

రక్షణరంగంలో విధులు నిర్వర్తించే వారి ఆహారం ఎలా ఉండాలో నిర్దేశించడానికి డీఎఫ్ఆర్ఎల్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం పని చేస్తూ ఉంటుంది. ఆ ప్రమాణాల మేరకు ఆహారం తయారు చేయడానికి అనుమతి సాధించారు ఓ తెలుగు మహిళ. ఈ అనుమతి సాధించడానికి ముందు ఆమె ఆహారం మీద అంతులేని పరిశోధన చేశారు. భూమిలో నాటే గింజ నుంచి పంట దిగుబడి, దినుసులను ప్రాసెస్ చేయడం, వండి చల్లార్చి డబ్బాల్లో ప్యాక్ చేయడం వరకు ప్రతిదీ ఒక చేతి మీదుగా నడిచినప్పుడే నిర్దేశించిన ప్రమాణాలను పాటించగలమని నమ్ముతారామె. సేంద్రియ పంట, వంటను ఈ నెల న్యూఢిల్లీలో జరిగిన 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సులో ప్రదర్శించి మరోసారి నిరూపించారు. ఈ సందర్భంగా సాక్షితో తన అనుభవాలను పంచుకున్నారు హైదరాబాద్‌లో నివసిస్తున్న కట్టెకోల మాధవి.

రైతులు విచిత్రంగా చూశారు!

మాది సూర్యాపేట. నాన్న ఉద్యోగ రీత్యా నా చదువు మొత్తం హైదరాబాద్‌లోనే. నిజానికి నా చదువుకి, నేనెంచుకున్న ఈ రంగానికి సంబంధమే లేదు. బీఎస్సీ స్టాటిస్టిక్స్ చేసి కొంత కాలం టీచర్‌గా, ఆ తర్వాత బ్యాంకులో ఉద్యోగం చేశాను. మా వారు మైక్రో బయాలజీ చేసి హిమాలయ సంస్థలో ఉద్యోగం చేశారు. నెలలో ఇరవై రోజులు క్యాంపుల ఉద్యోగం ఆయనది. జీవితం ఇది కాదనిపించేది. మన జ్ఞానాన్ని సరిగ్గా ఒకదారిలో పెడితే గొప్ప లక్ష్యాలను సాధించవచ్చనిపించింది. సొంతంగా ఏదో ఒకటి చేయాలనే నిర్ణయానికి 2009లో వచ్చాం. నాలుగేళ్లపాటు సమాజం అవసరాలేమిటి, అందుబాటులో ఉన్న వనరులేమిటి అని అధ్యయనం చేశాం. సమాజంలో ఆరోగ్యకరమైన ఆహారం తప్ప అన్నీ ఉన్నాయని తెలిసింది. మేము 2014లో గ్రామాలకు వెళ్లి రైతులతో కొర్రలు పండిస్తారా అని అడిగినప్పుడు మమ్మల్ని వెర్రివాళ్లను చూసినట్లు చూశారు. కుగ్రామాలకు వెళ్లి మహిళలకు మా ఉద్దేశాన్ని వివరించాం. విత్తనాల నుంచి పంటకు అవసరమైన ఇన్‌పుట్స్ అన్నీ మేమే ఇస్తాం, మీరు పండించిన పంటను మేమే కొంటాం... అని భరోసా ఇచ్చాం. దాంతోపాటు వారు పండించే కంది పంట మధ్య చాళ్లలో చిరుధాన్యాలను పండించమని సూచించాం. ఒక కందిపంట సమయంలో చిరుధాన్యాలు మూడు పంటలు వస్తాయి. తమకు నష్టం ఏమీ ఉండదనే నమ్మకంతో పాటు మామీద విశ్వాసం కలిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, రాజస్థాన్, సిక్కిం రాష్ట్రాల్లో మొత్తం 1350 మంది మహిళారైతులు మాతో కలిశారు. గ్రౌండ్ వర్క్ చేసిన తర్వాత 2018లో కంపెనీ ఖాద్యమ్‌ని రిజిస్టర్ చేశాం. ఖాద్యమ్ అనే సంస్కృత పదానికి అర్థం తినదగినది అని. పంట నుంచి మా ప్రయోగాలు వంటకు విస్తరించాయి.

వండి చల్లబరుస్తాం!

ఇడ్లీ, సాంబార్, చట్నీ వంటి ఆహార పదార్థాలు యంత్రాల్లోనే తయారవుతాయి. ఉడికిన వెంటనే మైనస్ నలభై డిగ్రీల ఉష్ణోగ్రతకు తీసుకువెళ్లడంతో వాటిలో ఉండే తేమ హరించుకుపోతుంది. ఇలా తయారైన ఆహారం ప్యాకెట్‌లలో తొమ్మిది నెలల పాటు నిల్వ ఉంటుంది. వేడినీటిలో ముంచితే ఐదు నిమిషాల్లో ఇడ్లీ మెత్తగా మారుతుంది, సాంబార్, చట్నీలు కూడా అంతే. మేము కనుగొన్న విజయవంతమైన ఫార్ములా ఇది. పోహా నుంచి స్పగెట్టీ, పాస్తా వరకు ఒక ఇంట్లో అన్ని తరాల వారూ ఇష్టపడే రుచులన్నింటినీ ఇలాగే చేస్తున్నాం. మొదట్లో రెడీ టూ కుక్ ఉత్పత్తుల మీద దృష్టి పెట్టాం. రోజూ వండి బాక్సు పట్టుకెళ్లడం కుదరని రోజుల్లో రెడీ టూ ఈట్ విధానాన్ని అనుసరించాం. ఆఫీస్‌కి టిఫిన్ బాక్స్ తేలిగ్గా తీసుకెళ్లడానికి, ప్రయాణాల్లో తీసుకెళ్లడానికి మా ఉత్పత్తులు చాలా అనువుగా ఉంటాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే సైన్యం అవసరాలకు తగినట్లు ఆహారాన్ని తయారు చేయడం పెద్ద సవాల్ అనే చెప్పాలి. మైసూర్‌లో ఉన్న డీఎఫ్ఆర్ఎల్‌కి ఎన్నిసార్లు వెళ్లామో లెక్క పెట్టలేం. యాభైసార్లకు పైగా వెళ్లి ఉంటాం. విమాన టిక్కెట్ల ఖర్చే లక్షల్లో వచ్చింది. సైంటిస్టులు సూచించిన నియమావళి ప్రకారం తయారు చేయడం, శాంపుల్ తీసుకెళ్లి చూపించడం, వాళ్లు చెప్పిన సవరణలను రాసుకుని హైదరాబాద్ రావడం, మేడ్చల్ దగ్గర బండ మాదారంలో ఉన్న మా యూనిట్‌లో తయారు చేసి మళ్లీ పట్టుకెళ్లడం... ఇలా సాగింది. మా ప్రయోగాల గురించిన ప్రతి వివరాన్నీ నోట్స్ సమర్పించాం. జీవితంలో ఓ గొప్ప లక్ష్యాన్ని సాధించాలనుకున్నాం, ఆ ప్రయాణంలో మేము లక్ష్యాన్ని చేరేలోపు ఉద్యోగంలో సంపాదించుకున్న డబ్బు రెండు కోట్లకు పైగా ఖర్చయిపోయింది. ఏ దశలోనూ వెనుకడుగు వేయకుండా దీక్షగా ముందుకెళ్లడమే ఈ రోజు విజేతగా నిలిపింది. ఏ- ఐడియా వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగానూ, మౌలిక వసతుల కల్పనలోనూ సహకరిస్తున్నాయి. మా ఉత్పత్తులు ఈ-కామర్స్ వేదికల మీద పన్నెండు దేశాలకు చేరుతున్నాయి. ఢిల్లీలో ఈ నెల మూడు నుంచి ఐదు వరకు 'వరల్డ్ ఫుడ్ ఇండియా' సదస్సు జరిగింది. అందులో స్టాల్ పెట్టమని ప్రభుత్వం నుంచి ఆహ్వానం రావడమే ఈ ప్రయత్నంలో మేము గెలిచామని చెప్పడానికి ఉదాహరణ'' అని వివరించారు ఖాద్యమ్ కో ఫౌండర్ మాధవి.

వరల్డ్ ఫుడ్ ఇండియా సదస్సులో...



డీఎఫ్ఆర్ఎల్... డిఫెన్స్ ఫుడ్ రీసెర్చ్ లాబొరేటరీ. కర్నాటక రాష్ట్రం మైసూర్‌లో ఉన్న ఈ సంస్థ డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)లో ఒక విభాగం. రక్షణ రంగంలో విధులు నిర్వర్తించే వారికి నిల్వ ఉండే ఆహారాన్ని సరఫరా చేస్తుంది. పర్వత ప్రాంతాలు, లోయలు, గడ్డకట్టే మంచులో ఉండే ఆర్మీ క్యాంపుల్లో విధులు నిర్వర్తించేవారికి తాజా ఆహారాన్ని అందించడం కొన్ని సందర్భాల్లో సాధ్యం కాదు. అలాంటి సమయాల్లో వారి ఆకలి తీర్చేది... ముందుగానే వండి, శీతలపరిచి డబ్బాల్లో నిల్వ చేసిన ఆహారమే. అలా నిల్వ చేసే ఆహారాన్ని తయారు చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఆహారం నెలల కొద్దీ నిల్వ ఉండాలి. అందులో పోషకాలు లోపించకూడదు.

– వాకా మంజులారెడ్డి
ఫొటో : నోముల రాజేశ్ రెడ్డి

వంటిల్లు

వెచ్చటి వెలుగుల్లో తియ్యటి ఘుమఘుమలు

ఇల్లంతా దీపాల సందడి, టపాసుల వెలుగుల్లో చిన్నాపెద్దల చిరునవ్వులతో ఒకటే హడావుడి. స్వీట్లు చేయడానికి ఓపిక, సమయం రెండూ ఉండవు. అయినా పండగపూట మనింట్లో తయారైన తీపి రుచే వేరు. అందుకే సులభంగా చేసుకోదగిన తీపి ఘుమఘుమలతో వచ్చేసింది మనందరి వంటిల్లు....

గుడ్ పారే

కావలసినవి:
మైదా – రెండు కప్పులు; **నెయ్యి** – పావు కప్పు; **పాలు** – అరకప్పు; **బెల్లం** – కప్పు; **శొంఠి పొడి** – టీస్పూను; **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా.

తయారీ: మైదాపిండిలో నెయ్యివేసి కలపాలి ● తరువాత గోరువెచ్చని పాలుపోసి ముద్దలా కలిపి ఇరవై నిమిషాలు పక్కన పెట్టుకోవాలి ● ఇరవై నిమిషాల తరువాత పిండిముద్దను రెండు భాగాలు చేయాలి ● ఒక్కో భాగాన్నీ మందపాటి చపాతీలా వత్తుకుని అంగుళం పరిమాణంలో ముక్కలు చేయాలి ● మిగతాపిండిని కూడా ఇదే విధంగా చేయాలి ● ఇప్పుడు సలసల కాగుతోన్న నూనెలో ఈ ముక్కలను వేసి మీడియం మంట మీద వేయించాలి. రెండువైపులా గోల్డెన్ బ్రౌన్ కలర్‌లోకి



మారితే పారేలు రెడీ అయినట్లే, వెంటనే తీసేయాలి ● బెల్లాన్ని గిన్నెలో వేసి పావుకప్పు నీళ్లుపోసి స్టవ్ మీద పెట్టాలి. మీడియం మంట మీద బెల్లం కరిగి సిరప్‌లా తయారయ్యేంతవరకు మరిగించాలి ● అడుగు అంటకుండా తిప్పుతూనే ఉండాలి. సిరప్ తయారైన తరువాత శొంఠి పొడివేసి కలిపి దించేయాలి ● వేయించి పెట్టుకున్న పారేలను సిరప్‌లో వేసి కలుపుతూనే ఉండాలి. ఇలా కలుపుతూ ఉండగానే మిశ్రమం మొత్తం చల్లబడి గుడ్ పారేలు అతుక్కోకుండా విడివిడిగా వస్తాయి. ఇప్పుడు తీసి ప్లేటులో వేసి సర్వ్‌చేసుకోవాలి ● గాలి చొరబడని డబ్బాలో వేసి ఉంచితే నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.

కాజు పిస్తా రోల్స్



కావలసినవి: **జీడిపప్పు** – ఒకటిన్నర కప్పులు; **పిస్తా పప్పు** – ఒకటిన్నర కప్పులు; **కండెన్స్‌డ్ మిల్క్** – ఒకటింబావు కప్పులు; **గ్రీన్ ఫుడ్ కలర్** – ఐదు చుక్కలు; **బటర్** – రెండు టేబుల్ స్పూన్లు; **పంచదార పొడి** – కప్పు; **యాలకులపొడి** – పావు టీస్పూను;

తయారీ: జీడిపప్పును దోరగా వేయించి, మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ అయిన తరువాత జల్లెడపట్టి పొడిని తీసుకోవాలి. ●బాణలిలో వెన్న వేసి వేడెక్కనివ్వాలి. కరిగిన బటర్‌లో కండెన్స్‌డ్ మిల్క్ పోయాలి. ● నిమిషం పాటు పాలను కలుపుతూ ఉండాలి. తరువాత జీడిపప్పు పొడి వేయాలి. ● సన్నని మంటమీద తిప్పుతూ ఐదునిమిషాలు వేయించాలి. తరువాత దించేసి చల్లారనివ్వాలి. ●చేతులకు కొద్దిగా నెయ్యి రాసుకుని జీడిపప్పు మిశ్రమాన్ని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. ● ఇప్పుడు పిస్తాపప్పుని దోరగా వేయించి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● గ్రైండ్ చేసిన మిశ్రమాన్ని జల్లెడపట్టి మెత్తటి పొడిని తీసుకోవాలి. ● పిస్తా పొడిలో పంచదార పొడి, యాలకుల పొడి, ఫుడ్ కలర్ కొద్దిగా వేడి నీళ్లు చల్లుకుంటూ ముద్దలా కలపాలి. ● ఇప్పుడు జీడిపప్పు ముద్దను రెండు ముద్దలుగా చేసి, ఒక్కో ముద్దను మందపాటి చపాతీలా వత్తుకుని, కాస్త వెడల్పుగా ఉండేలా ముక్కలు కోయాలి. ● పిస్తా ముద్దను చిన్న ఉండలుగా చేసి, వీటిని పొడవాటి రోల్స్‌లా చుట్టుకోవాలి. ● జీడిపప్పు ముక్కపైన పిస్తా రోల్‌ను పెట్టి, జీడిపప్పు ముక్కను రోల్ చేయాలి. ● పిండి ముద్దను మొత్తాన్ని ఇలా రోల్ చేసి, పైన కుంకుమ పువ్వు, సిల్వర్ పేపర్‌తో గార్నిష్ చేస్తే కాజుపిస్తా రోల్స్ రెడీ.

షీర్ పీరా

కావలసినవి: **పంచదార** – కప్పు; **పాలపొడి** – రెండు కప్పులు; **బాదం పలుకులు** – టేబుల్ స్పూను; **జీడిపప్పు పలుకులు** – టేబుల్ స్పూను; **పిస్తా పలుకులు** – టేబుల్ స్పూను; **కిస్‌మిస్** – టేబుల్ స్పూను; **యాలకులు** – నాలుగు; **నెయ్యి** – టేబుల్ స్పూను; **గార్నిష్ కోసం.... పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు** – టేబుల్ స్పూను (పెద్దసైజువి).

తయారీ: డ్రైఫ్రూట్స్ పలుకులు సన్నగా పొడవుగా ఉండేలా తీసుకోవాలి ● మందపాటి బాణలిలో పంచదార, కప్పు నీళ్లుపోసి మంటమీద పెట్టాలి ● తీగపాకం వచ్చేంత వరకు మరిగించాలి ● తీగపాకం వచ్చినప్పుడు సన్నమంటమీద ఉంచాలి ● ఇప్పుడు పాలపొడిని కొద్దికొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా కలుపుతూ ఉండాలి ● పాలపొడి దగ్గర పడేంత వరకు కలుపుతూనే ఉండాలి ● దగ్గర పడుతున్నప్పుడు బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు, కిస్‌మిస్ ముక్కలను వేసి కలపాలి ● చివరిగా యాలకులను పొడిచేసి వేయాలి ● ప్లేటుకును నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని వేయాలి ● ప్లేటంతా సమంగా పరుచుకుని పైన కొద్దిగా పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి ● స్పూను పెట్టి పైన కూడా సమంగా వత్తుకుని ప్లేటుని రిఫ్రిజిరేటర్‌లో పెట్టాలి ● రెండు గంటల తరువాత నచ్చిన ఆకారంలో ముక్కలు కట్‌చేసి సర్వ్ చేసుకోవాలి.



చిరోటీ



కావలసినవి: **మైదా** – ఒకటింబావు కప్పులు; **సూజీ రవ్వ** – కప్పు; **నెయ్యి** – రెండు టేబుల్ స్పూన్లు; **ఉప్పు** – చిటికెడు; **నూనె** – డీప్‌ఫ్రైకి సరిపడా; **పంచదార** – అరకప్పు; **యాలకులు** – మూడు; పిస్తా తురుము గార్నిష్‌కు సరిపడా.

పేస్టుకోసం: **బియ్యప్పిండి** – రెండు టేబుల్ స్పూన్లు; **నెయ్యి** – మూడు టేబుల్ స్పూన్లు.

తయారీ: కప్పు మైదా, సూజీరవ్వ, ఉప్పుని ఒక గిన్నెలో వేసి కలిపి పెట్టుకోవాలి ● బాణలిలో నెయ్యి వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నెయ్యిలో కలిపి పెట్టుకున్న మైదా మిశ్రమాన్ని వేసి వేయించాలి. ● రెండు నిమిషాల తరువాత నీళ్లు చల్లుకుంటూ పూరీ పిండిలా కలుపుకోవాలి. ● పిండి ముద్ద తయారయ్యాక దానిపై తడిబట్టని కప్పి రెండుగంటలు పక్కన పెట్టుకోవాలి. ● ఇప్పుడు పంచదార, యాలకులను మిక్సీజార్‌లో వేసి మెత్తగా పొడిచేయాలి. ● కరిగించిన నెయ్యిని బియ్యప్పిండిలో వేసి, పేస్టులా కలిపి పెట్టుకోవాలి. ● రెండు గంటల తరువాత పిండి ముద్దను మరోసారి బాగా కలిపి దానిని చిన్నచిన్న ఉండలుగా చేయాలి. ● ఒక్కో ఉండను చపాతీలా వత్తుకోవాలి. ● మూడు చపాతీలు చేసిన తరువాత... ఒకదాని మీద ఒకటి పెట్టి పై చపాతీపైన టీస్పూను బియ్యప్పిండి పేస్టుని రాయాలి. తరువాత కొద్దిగా మైదాను చల్లాలి. ● ఇప్పుడు చపాతీని మడతలు వేయాలి. ఒక్కో మడతకు టీ స్పూను బియ్యప్పిండి పేస్టు, కొద్దిగా మైదాను చల్లుకుంటూ చపాతీ మొత్తాన్ని మడత వేయాలి. ● పూర్తయ్యాక చపాతీ రోల్స్‌ను అంగుళం ముక్కలుగా కట్ చేయాలి ● ఒక్కోముక్కను గుండ్రంగా చేసి పూరీలా వత్తుకోవాలి ● మరీ పలుచగా లేదా మరీ మందంగా కాకుండా ఒక మాదిరిగా వత్తుకుని మధ్యలో చిన్న రంధ్రం చేయాలి ● ఇప్పుడు ఈ చపాతీలను సలసల కాగుతోన్న నూనెలో వేసి మీడియం మంట మీద లేత బంగారు వర్ణంలోకి మారేంత వరకు వేయిస్తే చిరోటీ రెడీ ● చిరోటీలను ఒకదానిమీద ఒకటి పేర్చి, పైన పంచదార పొడి, పిస్తా తురుము చల్లి సర్వ్ చేసుకోవాలి.

సీమ థర్మల్ విద్యుత్ కేంద్రానికి ‘ఎంవీఆర్’ పేరు

దివంగత కార్మిక నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి సేవలకు గుర్తింపు



సాక్షి, అమరావతి/ఎర్రగుంట్ల(వైఎస్సార్ జిల్లా: రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంట్(ఆర్టీపీపీ) పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా పేరు మారుస్తూ ఏపీ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులిచ్చింది. కార్మిక నేతగా, ఎమ్మెల్యేగా, రచయితగా రాయలసీమ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన దివంగత నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి(ఎంవీఆర్) సేవలకు గుర్తింపుగా, రాయలసీమ ప్రాంత నేతల విజ్ఞప్తి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి ఆమోదంతో వైఎస్సార్ జిల్లా కలమళ్లలోని 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా మార్చుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పేరు మార్పు తక్షణమే అమల్లోకొస్తుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మూడు థర్మల్ ప్లాంట్లకు ముగ్గురి పేర్లు

ఏపీలో మూడు థర్మల్ పవర్ ప్లాంట్లుండగా, వేర్వేరు రంగాలకు చెందిన వారి పేర్లు వాటికి సార్థక నామధేయాలుగా మారాయి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ప్లాంట్‌కు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రమని పేరు పెట్టారు. ఇబ్రహీంపట్నంలోని పవర్ ప్లాంటుకు విద్యుత్ రంగ పితామహుడుగా పేరు పొందిన డాక్టర్ నార్ల తాతారావు పేరు పెట్టారు. తాజాగా ఆర్టీపీపీని కార్మిక నేత ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్లాంటుగా ప్రభుత్వం మార్చింది.

ఎంవీఆర్ కృషితో సీమలో థర్మల్ ప్లాంట్

వెనుకబడ్డ రాయలసీమ ప్రాంతంలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం థర్మల్ విద్యుత్ కర్మాగారం ఏర్పాటు చేయాలని మొట్టమొదట డిమాండ్ చేసిన నేత డాక్టర్ ఎంవీ రమణారెడ్డి. 1985లో ‘రాయలసీమ కన్నీటి గాథ’ అనే పుస్తకం ద్వారా ఆయన రాయలసీమ సమస్యలను ప్రజల దృష్టికి తెచ్చారు. ఎంవీఆర్ చేసిన డిమాండ్.. ఆర్టీపీపీ స్థాపనకు బాట వేసిందని, ఆ నేతకు నివాళిగా ఆర్టీపీపీ పేరును డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టుగా మార్చాలని రాయలసీమ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాయలసీమ విమోచన సమితి పేరుతో రమణారెడ్డి, రాయలసీమ సంయుక్త కార్యాచరణ సమితి పేరుతో వైఎస్సార్, మాజీ మంత్రి ఎంవీ మైసూరారెడ్డి, టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి తదితర నేతలంతా అప్పట్లో ఉద్యమం చేపట్టారని సాహితీవేత్త భూమన్ తెలిపారు.

ఐటీ దాడులకు బీజేపీకి సంబంధం లేదు

- దీపావళి తరువాత బీజేపీ ప్రచారాన్ని ఉరకలెత్తిస్తాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ పాలన తడిబట్టలతో గొంతుకోసేలా తయారైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు ప్రజలపై కంటే మాఫియాపైనే ఎక్కువ నమ్మకం ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ దున్నపోతులను తినే రకం అయితే... కాంగ్రెస్ పార్టీ ఏకంగా ఏనుగులను తినే రకం అని విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బీజేపీ తరఫున పోటీచేసే లంకల దీపక్ రెడ్డి (జూబ్లీహిల్స్), నవీన్‌కుమార్ (వికారాబాద్), శ్రీకాంత్‌రెడ్డి (సిద్దిపేట), మొగిలయ్య (నకిరేకల్), పూస రాజు (ముషీరాబాద్)కు బీ–ఫారాలను అందచేసిన సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. దీపావళి తర్వాత ఈనెల 13వ తేదీ నుంచి బీజేపీ ప్రచారాన్ని ఉరకలెత్తిస్తామని చెప్పారు. ఐటీ దాడులు ఎక్కడో చోట జరుగుతూనే ఉంటాయని, వారున్నదే దాడులు చేయడానికని వ్యాఖ్యానించారు. ఆదాయ పన్ను చెల్లించకుండా ఎగ్గొట్టారని సమాచారం వచ్చిన వారిపై దాడులు చేస్తారని, ఆ దాడులకు బీజేపీకి, కేంద్రానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. ఐటీ దాడులు జరుగుతాయని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ముందే ఎలా తెలుసని నిలదీశారు. జనంలోకి వెళ్లకుండా, మాట్లాడకుండా కొన్ని సంస్థలు సెల్‌ఫోన్, కంప్యూటర్‌ల ముందు కూర్చుని సర్వే నివేదికలు ఇస్తున్నాయని, అవన్నీ దొంగ సర్వేలని కిషన్‌రెడ్డి కొట్టిపారేశారు. ఈ సర్వేలపై ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

11న మోదీ.. : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఈనెల 11న రాష్ట్రానికి వస్తున్నారని, ఆ తరువాత మరో రెండు మూడు సభల్లో పాల్గొంటారని కిషన్‌రెడ్డి తెలిపారు.

మహేశ్వరం రజాకార్ల రాజ్యమా?: బండి సంజయ్

వలస పక్షులను తరిమికొట్టండి



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ శివారులోని మహేశ్వరంలో రజాకార్ల రాజ్యం నడుస్తుందని అనుకుంటున్నారా అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. ఎంఐఎం అరాచకాలు శ్రుతి మించినా అధికార పార్టీ నోరు మెదపలేదని, మహేశ్వరంలో కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పాతబస్తీ ఎంఐఎం కార్యకర్తలకు పంచిపెట్టారని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అందెల శ్రీరాములు యాదవ్ దాఖలు చేసిన నామినేషన్ కార్యక్రమానికి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో స్థానిక పరిస్థితులపై ధ్వజమెత్తారు. మహేశ్వరంలోని కందుకూర్ మండలంలో ఫార్మాసిటీ కోసం 19వేల ఎకరాలు రైతుల నుంచి లాక్కున్నారని, స్థానికులకు మాత్రం ప్రభుత్వం ఒక్క ఉద్యోగమివ్వలేదని విమర్శించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి భూకబ్జాలకు, అవినీతి, అక్రమాలకు అంతేలేదని, ధరణి పేరుతో ఆమె తనయుడు భూకబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఒక పార్టీ టికెట్‌పై గెలిచి ఎంఐఎం మధ్యవర్తిత్వంతో బీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవులను అనుభవించడం సిగ్గు చేటన్నారు. మహేశ్వరంలో కాంగ్రెస్ అభ్యర్థి ఓ డమ్మీ అని, మేడ్చల్ నుంచి వలస వచ్చి పోటీ చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలిద్దరూ కాంగ్రెస్ నుంచి వచ్చిన వలసపక్షులేనని అన్నారు. వారిని ఎన్నికల్లో ఓడించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థి శ్రీరాములు యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మహేశ్వరం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుకి దక్కని ఊరట

- ఫైబర్‌నెట్ కేసు విచారణ 30కి వాయిదా
- స్కిల్ కేసులో తీర్పు దీపావళి తర్వాతే నన్న సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబుకు సుప్రీంకోర్టులో మరోసారి ఊరట లభించలేదు. ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిలు కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈనెల 30కి వాయిదా వేసింది. చంద్రబాబు పిటిషన్ గురువారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించబోతుండగా.. జస్టిస్ అనిరుద్ధ బోస్ జోక్యం చేసుకుని స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో ఎఫ్ఐఆర్ క్వాష్ చేయాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు దీపావళి సెలవుల తర్వాత వెలువడే అవకాశముందని లూథ్రానుద్దేశించి చెప్పారు. ఆ కేసులో తీర్పు వెలువడిన తర్వాతే ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు విచారించాల్సి ఉంటుందన్నారు. మరోవైపు.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకి అక్టోబరు 30న ఏపీ హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిలు ఇచ్చిందని ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఫైబర్‌నెట్ కేసు నవంబరు 23కు వాయిదా వేస్తామని ధర్మాసనం పేర్కొంది. అయితే, మరో తేదీన విచారణ చేపట్టాలని లూథ్రా విజ్ఞప్తి చేశారు. దీంతో నవంబరు 30కు ఫైబర్‌నెట్ కేసు విచారణ వాయిదా వేశారు. అప్పటి వరకూ చంద్రబాబును అరెస్టుచేయకూడదని ఆదేశాలివ్వాలని లూథ్రా కోరారు. దీనిపై ఇప్పటికే ఒప్పందం ఉందిగా అని ఏపీ సీఐడీ తరఫు మరో సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ గుర్తుచేశారు. అనంతరం.. అక్టోబరు 30 వరకూ చంద్రబాబును అరెస్టు చేయరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే, ‘పిటిషనర్ దాఖలు చేసిన మరో పిటిషన్ ఉంది. దాంట్లో రిజర్వు చేసిన తీర్పు ఇదే ధర్మాసనం ఇవ్వాల్సి ఉంది. రెండింటికీ ముడిపడిన అంశాలున్నాయి. అందువల్ల ఈ కేసు నవంబరు 30కు జాబితా చేయాలని ఆదేశిస్తున్నాం’.. అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫైబర్‌నెట్ కేసులో సుప్రీంకోర్టు విచారణ సాగుతుండగా చంద్రబాబును అరెస్టుచేయబోమని ఏపీ సీఐడీ ధర్మాసనానికి ఇప్పటికే చెప్పిన విషయం విదితమే.

మరో ఏడుగురికి బీజేపీ టికెట్లు!

▶ మొదటి పేజీ తరువాయి

ఈ సీటుకోసం జనసేన ప్రయత్నం చేసింది. కానీ తనకు సంబంధించిన చేవెళ్ల లోక్‌సభ స్థానం పరిధిలోని కీలకమైన సీటు కావడంతో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పట్టుబట్టి రవికుమార్ యాదవ్‌కు ఇప్పించుకున్నారు. ఇక మల్కాజిగిరిలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుకు.. పెద్దపల్లిలో పార్టీ ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు టికెట్లు ఇచ్చారు. సంగారెడ్డి నుంచి పులిమామిడి రాజు, నాంపల్లి నుంచి రాహుల్‌చంద్ర, కంటోన్మెంట్ నుంచి రిటైర్డ్ ఐపీఎస్ కృష్ణప్రసాద్‌ల పేర్లు ఖరారైనట్టు తెలిసింది. ఇంకా నర్సంపేట, మధిర, అలంపూర్, దేవరకద్ర, చాంద్రాయణగుట్ట సీట్లకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. చాంద్రాయణగుట్ట అభ్యర్థిగా సత్యనారాయణ ముదిరాజ్ పేరును ఇంతకుముందే ప్రకటించినా.. అనారోగ్య కారణాలతో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు. శుక్రవారం నామినేషన్ల దాఖలుకు చివరితేదీ కావడంతో.. ఈ ఐదు సీట్లకు వెంటనే అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది.

నేడు నామినేషన్లు.. ప్రచార సభల్లో కేంద్రమంత్రులు

శుక్రవారం బీజేపీ అభ్యర్థుల నామినేషన్లు, ప్రచార సభల్లో పలువురు కేంద్ర మంత్రులు పాల్గొననున్నారు. వరంగల్‌లో కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, చేవెళ్లలో బీఎల్ఎస్ వర్మ, కొల్లాపూర్‌లో పురుషోత్తం రూపాలా తదితరులు పర్యటించనున్నారు. ఈ నెల 13 నుంచి 27 వరకు జరిగే బీజేపీ ఎన్నికల ప్రచార సభలు, కార్యక్రమాల్లో ప్రధాని మోదీ, అమిత్‌షా, నడ్డాలతోపాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, సీనియర్ నేతలు పాల్గొంటారని బీజేపీ అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తెలిపారు.

టికెట్ ఖరారు సమాచారం అందిన నేతలు

నియోజకవర్గం	అభ్యర్థి
1.మల్కాజిగిరి	రాంచందర్‌రావు
2.మేడ్చల్	విక్రమ్‌రెడ్డి
3.పెద్దపల్లి	దుగ్యాల ప్రదీప్‌రావు
4.శేరిలింగంపల్లి	రవికుమార్ యాదవ్
5.నాంపల్లి	రాహుల్ చంద్ర
6.కంటోన్మెంట్	కృష్ణప్రసాద్
7.సంగారెడ్డి	పులి మామిడి రాజు

దీపావళి నాడు ఫైర్ సిబ్బంది అంతా విధుల్లోనే..

అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: దీపావళి పండుగ రోజున ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అనుకోని పరిస్థితుల్లో ఏమైనా జరిగితే వెంటనే స్పందించేలా అగ్నిమాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని ఆ శాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి తెలిపారు. పండుగ రోజు అధికారులు, సిబ్బంది తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది సెలవులను సైతం రద్దు చేశామని పేర్కొన్నారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే 101 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు.

బీఆర్ఎస్, బీజేపీ ఓటమే లక్ష్యం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ

- వామపక్ష ఐక్యతకు గండికొట్టలేదని వెల్లడి..
- రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని ఆకాంక్ష



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమని, రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలన్నదే తమ ఆకాంక్ష అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్‌లో చాడ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనేందుకు ఎన్నికల ముంగిట కాంగ్రెస్ అభ్యర్థులపై జరుగుతున్న ఐటీ దాడులే నిదర్శనమని ఆరోపించారు. ప్రపంచ రికార్డ్ అని చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు కుంగిపోయిన రికార్డు సాధించిందని ఎద్దేవా చేశారు. ఎన్ని కుయుక్తులు పన్నినా అధికార పార్టీకి ప్రజాతిరుగుబాటు తప్పదని జోస్యం చెప్పారు. కొత్తగూడెం స్థానంలో తమ పార్టీ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును ప్రజలు గెలిపిస్తారని చాడ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 24 గంటల నాణ్యమైన కరెంటు అమలు కావడం లేదని విమర్శించారు. ధనిక రాష్ట్రంలో పేదల ఆదాయం ఎందుకు పెరగడం లేదని, వారు ఇంకా ప్రభుత్వంపైన ఆధారపడాల్సిన పరిస్థితులు ఎందుకొచ్చాయని ప్రభుత్వాన్ని నిలదీశారు.

కేసీఆర్ మాట తప్పారు..

గతంలో బీజేపీకి మద్దతిచ్చిన మాట వాస్తవమేనని, ఇప్పుడు ఆ పార్టీకి దూరంగా ఉంటామంటూ సీఎం కేసీఆర్ మునుగోడు ఉపఎన్నిక ముందు తమతో చెప్పారని చాడ గుర్తుచేశారు. కానీ ఆ తర్వాత ఆయన మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడాలని, భూమి సమస్యలు పరిష్కారానికి నోచుకోవాలని చాడ ఆకాంక్షించారు.

వై.ఎస్. హయాం నాటి ఎల్లంపల్లి చెక్కుచెదరలేదు

సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల రీడిజైనింగ్ పేరుతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కట్టిన మూడేళ్లకే దెబ్బతిన్నదని చాడ విమర్శించారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో నాటి సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి మేడిగడ్డకు సమీపంలో శ్రీకారం చుట్టిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నేటికీ చెక్కుచెదరలేదని చాడ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

తప్పని పరిస్థితుల్లోనే కాంగ్రెస్‌తో ముందుకు...

సీట్ల విషయంలో కాంగ్రెస్, సీపీఎం మధ్య అవగాహన కుదరలేదని, కాబట్టి వామపక్షాలుగా కలసి పోటీ చేయలేకపోతున్నామని చాడ ఓ ప్రశ్నకు బదులిచ్చారు. తామేమీ వామపక్ష ఐక్యతకు గండికొట్టలేదని.. 2018లోనూ సీపీఐ, సీపీఎం వేర్వేరుగానే ఎన్నికలకు వెళ్లాయని గుర్తుచేశారు. తమతో అవగాహనలో భాగంగా కాంగ్రెస్ ఒక్క సీటే కేటాయించడంపట్ల సంతృప్తి లేకున్నా అప్రజాస్వామిక, నియంతృత్వ బీఆర్ఎస్‌ను ఓడించేందుకు తప్పని పరిస్థితుల్లోనే ఆ పార్టీతో ఎన్నికల అవగాహనతో ముందుకెళ్తున్నామని చాడ వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పొత్తులు అనివార్యమయ్యాయని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీయే ఎన్డీఏ పేరుతో 36 పార్టీలతో పొత్తు పెట్టుకుందని చాడ గుర్తుచేశారు.

గాంధేయవాది ‘కొనకండ్ల’ మృతి

ఆమరణ దీక్షలతో ప్రభుత్వ స్థలాలకు రక్షణ



సత్యనారాయణ (ఫైల్)

కారేపల్లి: ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన సంతగుడి మాజీ చైర్మన్, గాంధేయవాదిగా గుర్తింపు పొందిన కొనకండ్ల సత్యనారాయణ(72) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. కారేపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించగా, ఆమరణ దీక్ష ద్వారా ఆయన అడ్డుకున్నారు. దీంతో పాటు సింగరేణి గ్రామానికి సీఎస్ఆర్ నిధుల సాధన, పేదలకు ఇళ్ల స్థలాలపై పలుమార్లు ఆందోళనలు చేశారు. కొనకండ్ల మృతి విషయం తెలుసుకున్న వైరా బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బానోత్ మదన్‌లాల్, మాలోత్ రాందాస్ నాయక్, జెడ్పీటీసీ వాంకుడోతు జగన్, ఎంపీపీ మాలోత్ శకుంతల, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, నాయకులు పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, పెద్దబోయిన ఉమాశంకర్ తదితరులు నివాళులర్పించారు.


ఆర్థిక రంగ సేవలు సులభతరం



సావనీర్ ఆవిష్కరిస్తున్న సత్యప్రకాశ్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: వేగంగా మారుతున్న సమాజంలో కీలకమైన ఆర్థిక రంగంలోనూ సేవలు సులభతరమయ్యాయని హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.సత్యప్రకాశ్ తెలిపారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యాన ‘ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్ ఇండియా ఎమర్జింగ్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్’ అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షత వహించగా, సత్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ దేశ ఆర్థిక రంగంలో సంక్షోభాలు వస్తున్నా అధిగమిస్తున్నామని తెలిపారు. కేయూ ప్రొఫెసర్ డాక్టర్ కట్ల రాజేందర్ కీలకోపన్యాసం చేస్తూ దశాబ్దకాలంగా ఇన్సూరెన్స్, మైక్రో ఫైనాన్స్, డిజిటల్ బ్యాంకింగ్ రంగంలో వేగంగా మార్పులు జరిగాయని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీ.వీ.రెడ్డితో పాటు డాక్టర్ పి.సర్వేశ్వరరావు, డాక్టర్ రమాసత్యవతి, డాక్టర్ బ్రహ్మం, శ్రీనివాస్, స్వామి, రమేష్, రమణ, సేత్రాం, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

దీపావళి ‘గ్రీన్’గా జరుపుకుందాం..



గ్రీన్ టపాసులైతే సరి

గ్రీన్ టపాసుల తయారీలో పోటాషియం, నైట్రేట్, జియో లైట్ ఉపయోగిస్తారు. సాధారణ టపాసులతో పోలిస్తే 30 శాతం కాలుష్యం తగ్గుతుందని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. వీటి ధర కూడా అందరికీ అందుబాటులో ఉన్న నేపథ్యాన ఉపయోగించాలని కోరుతున్నారు.

- అందుబాటులో పర్యావరణానికి మేలు చేసే టపాసులు
- కాలుష్య కారక బాణసంచాకు దూరంగా ఉంటే మేలు
- మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలంటున్న పర్యావరణవేత్తలు

కొత్తగూడెంటౌన్: నరకాసురుడిని సత్యభామ సంహరించిన రోజున దీపావళి పండుగను జరుపుకుంటున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. దీపావళి అంటేనే దీపాలంకరణలు, టపాసుల మోతలు గుర్తుకొస్తాయి. అయితే, నానాటికీ పెరుగుతున్న కాలుష్యం నేపథ్యాన సాధారణ బాణసంచాకు బదులు కొత్తగా పర్యావరణానికి హానీ చేయని విధంగా తయారుచేసే బాణసంచా కాల్చాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ఇది కాకపోతే కేవలం దీపాలు వెలిగించి, మొక్కలు నాటి ముందు తరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించేలా ఆలోచించాలని కోరుతున్నారు.

అందరికీ సంబురమే

చిన్నాపెద్ద అందరికీ అత్యంత ఇష్టమైన పండుగ దీపావళి. ఈ నెల 12వ తేదీన దీపావళి పండుగ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఎక్కడ చూసినా పటాసులు కాల్చి అంబురాన్నంటేలా సంబురాలు నిర్వహిస్తారు. ఇళ్లకు విద్యుత్ లైట్లు, ఇళ్ల ఎదుట దీపాలు వెలిగించి లక్ష్మీదేవి పూజలు, నోములు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

సుప్రీంకోర్టు ఆదేశాలతో..

టపాసులు కాల్చడం వల్ల పర్యావరణం కలుషితమవుతుందని పర్యావరణవేత్తలు 2020లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అదేసమయాన కొందరు పర్యావరణ వేత్తలు సైతం కేసు వేశారు. దీంతో పర్యావరణానికి హాని కలిగించే టపాసులను కాల్చొద్దని సుప్రీంకోర్టు నిషేధించింది. ఇందుకు బదులు గ్రీన్ టపాసులను కాల్చి పండుగ జరుపుకోవాలని సూచించింది.

కాలుష్యంతో పాటు శబ్దాలు

టపాసులను కాల్చడం వల్ల తాత్కాలికంగా ఆనందం ఇచ్చినా అందులో నుంచి విడుదలయ్యే విష వాయువులు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయి. అలాగే, టపాసుల పేలుళ్ల శబ్దం 90 డిసెబుల్స్ దాటితే వినికిడి శక్తిపై ప్రభావం చూపుతుంది. సాధారణ టపాసుల్లో వాడే పదార్థాలు సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ వెదజల్లడంతో శ్వాసకోశ వ్యాధులకు కారణమవుతుంది.


టపాసులతో జాగ్రత్త..



సాధారణ టపాసులు కాలిస్తే ఆరోగ్యానికి హాని జరుగుతుంది. వీటి శబ్దాలతో వినికిడి శక్తిపై ప్రభావం పడనుండగా.. రక్తపోటు, గుండెజబ్బులు వచ్చే అవకాశముంది. అదే గ్రీన్ క్రాకర్స్‌తో ఈ ఇబ్బందులు ఉండకపోగా వాతావరణానికి మంచిది.

–డాక్టర్ బాబూరావు, చెస్ట్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, కొత్తగూడెం


పర్యావరణాన్ని రక్షించుకుందాం..



గ్రీన్‌కాకర్స్ కాల్చి కాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలి. దీపావళి రోజున అందరూ మొక్క నాటితే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. కాలుష్యం వెదజల్లే టపాసులను కాల్చడం వల్ల అనర్థాలపై అవగాహన పెంచుకోవాలి.

–కొట్టూరి సూర్య రాజశేఖర్, కొత్తగూడెం


దీపావళి పండుగలో శాస్త్రీయత



దీపావళిని మంచిపై చెడు సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకుంటారు. టపాసులు కాల్చడంతో వచ్చే పొగతో సూక్ష్మక్రిములు, దోమలు నశిస్తాయి. ఇందుకోసం సాధారణ క్రాకర్స్ కాకుండా ప్రతిఒక్కరూ గ్రీన్ క్రాకర్స్ కాలిస్తే మేలు.

–దత్తాత్రేయస్వామి, అర్చకులు, కొత్తగూడెం

కాలుష్య రహితంగా జరుపుకుందాం



దీపావళి పండుగ అందరికీ ఇష్టం. కాలుష్యాన్ని తగ్గించేందుకు దీపాలు వెలిగించి గ్రీన్ క్రాకర్స్ కాలిస్తే అందరికీ మేలు జరుగుతుంది. భావి తరాలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతుగా పాటుపడాలి.

–కేవీ రంగాకిరణ్, బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు

దూదేకులను బీసీ ‘ఈ’లోకి మార్చాలి



అభివాదం చేస్తున్న దూదేకుల సంఘం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకులను బీసీ ‘బీ’ నుంచి బీసీ ‘ఈ’లోకి మార్చాలని తెలంగాణ దూదేకుల, నూర్‌బాషా, ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్‌బాషా డిమాండ్ చేశారు. ఖమ్మంలో గురువారం జరిగిన దూదేకుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దూదేకుల జనాభా దామాషా ప్రకారం సంక్షేమ పథకాలు అమలుచేయాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు షేక్ లాల్‌జాన్‌పాషా, సోందుమియా, షేక్ జానీబేగం, సభీనాబీ, దుర్గారావు, యుగేందర్, ముస్తఫా, ఆజం, అజీజ్, రహీం, రహీంపాషా, తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి ఇంట్లో తనిఖీలతో మాకు సంబంధం లేదు..

బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామా నాగేశ్వరరావు



వైరాలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

వైరా: కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్, పాలేరు అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇళ్లు, ఐటీ దాడులకు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వైరాలో బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ నామినేషన్ కార్యక్రమానికి గురువారం హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీకి బీజేపీతో సంబంధం లేదని తెలిపారు. పార్లమెంట్ లోపల, బయట బీజేపీ విధానాలపై ఐదేళ్లుగా పోరాడుతున్నామని చెప్పారు. ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ నాయకులు లేనిపోని నిందలు వేస్తున్నారని తెలిపారు. ఏదిఏమైనా తెలంగాణలో మూడోసారి కూడా బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందని నాగేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. వైరా ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు ఉన్నారు.

విజ్ఞత కోల్పోయిన రాఘవులు..

- బుర్జువా పార్టీలతో పొత్తు పెట్టుకునేదే సీపీఎం
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి ‘పోటు’



మాట్లాడుతున్న రంగారావు, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజకీయ విచక్షణ, విజ్ఞత కోల్పోయిన సీపీఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఖమ్మంలో గురువారం రంగారావు మాట్లాడుతూ సీపీఎం బురదను ప్రజాపంథాకు పూసి, తమ ఒంటికి ఉన్న సెంట్‌ను వారు రాసుకోవాలనే తాపత్రయంలో ఉన్నారని మండిపడ్డారు. నిన్నటి వరకు కాంగ్రెస్‌తో రెండు సీట్ల కోసం బేరమాడి కుదరక 19 స్థానాల్లో పోటీకి దిగారని ఎద్దేవా చేశారు. ఆ పార్టీది అవకాశవాద రాజకీయ ఎత్తుగడ అని ప్రజలకు అర్థమైందని, బీఆర్ఎస్ నుంచి డబ్బు తీసుకొని సీపీఎం కావాలనే ఇన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని చర్చించుకుంటున్నారని తెలిపారు. మునుగోడు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భుజాలపై మోశారని చెప్పారు. ప్రతీ ఎన్నికలో బూర్జువా పార్టీతో పొత్తు పెట్టుకోవాలని చూసేది సీపీఎం అని విమర్శించారు. తమ పార్టీ మొదటి నుండి బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంలను ఓడించే శక్తులకు ఓటు వేసి గెలిపించే విధానంతో ముందుకు సాగుతోందని రంగారావు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రజాపంథా నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు, జి.రామయ్య, ఆవుల అశోక్, టి.ఝాన్సీ, ఎ.మంగతాయి, కె.శ్రీనివాస్, వి.వెంకటేష్ పాల్గొన్నారు. కాగా, ప్రతిపక్ష పార్టీ నేతల ఇళ్లపై ఐటీ దాడులతో భయభ్రాంతులకు గురిచేయటం సరి కాదని ప్రజాపంథా రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు పోటు రంగారావు, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి ఇళ్లలో తనిఖీలు జరుగుతుండడంతో వారు ప్రకటన విడుదల చేశారు.

రాజకీయ భవిష్యత్‌పై చర్చిస్తున్నా..

టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ



ఎడవల్లి కృష్ణతో మాట్లాడుతున్న కూనంనేని

పాల్వంచ: రాజకీయ భవిష్యత్‌పై అనుచరులతో చర్చిస్తున్నానని, తన నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటిస్తానని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ తెలిపారు. పాల్వంచలోని స్వగృహంలో గురువారం ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తనను కాదని, పొత్తుల పేరుతో సీపీఐ అభ్యర్థికి కేటాయించడంతో మనస్తాపానికి గురయ్యాయన్నారు. దీంతో పార్టీలో కొనసాగాలా, లేదా అన్న విషయమై చర్చిస్తున్నానని తెలిపారు.

ఎడవల్లిని బుజ్జగించిన కూనంనేని..

టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ ఇంటికి సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు వచ్చారు. పొత్తులో భాగంగా తనకు టికెట్ ఇచ్చినందున విజయానికి సహకరించాలని కోరగా, కృష్ణ స్పందిస్తూ కార్యకర్తలతో చర్చించి నిర్ణయాన్ని చెబుతానని తెలిపారు. కాంగ్రెస్, సీపీఐ నాయకులు నూకల రంగారావు, గద్దల రమేష్, రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, జలీల్, కొండా వెంకన్నగౌడ్, సకినాల వెంకన్న, చారి, వీరయ్య చౌదరి, శ్రీను, సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, సాయిబాబు, వడ్లమూడి పూర్ణచందర్‌రావు, నయీం ఖురేషీ, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.